క్లుప్తంగా

వైభవంగా నృసింహుని జయంత్యుత్సవాలు


మామిళ్లపల్లిలో ప్రత్యేకంగా అలంకరించిన నరసింహస్వామి ఆలయం

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నరసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముక్తాపురం, మామిళ్లపల్లి, తగరకుంట, తదితర గ్రామాల్లోని నరసింహస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వాతి నక్షత్రం, పౌర్ణమి తిథులలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ముక్తాపురం నరసింహస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వ్యాధి నిరోధక టీకాలే శ్రీరామరక్ష

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు శ్రీరామ రక్షలా పని చేస్తాయని సీహెచ్ఓ హేమలత పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించిన చిన్నారులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె ఆసుపత్రిలో నిల్వ చేసిన టీకాలను పరిశీలించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, టీకాల పంపిణీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బుధవారం గ్రామాల్లో విలేజ్ క్లీనిక్‌లు, ప్రతి శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయాలన్నారు. అనంతరం ఏఎన్ఎం కోమలి చిన్నారులకు పంటా, ఐబీవీ, ఓపీవీ తదదితర టీకాలు వేశారు. అలాగే నార్శింపల్లి, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, దాడితోట, కునుకుంట్ల, పిన్నదరి, చిల్లవారిపల్లి తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జయరాంకు డాక్టరేట్


జయరాంకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణానికి చెందిన ఎం జయరాంకు రాజస్థాన్ సన్‌రైజ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. జయరాం బోటనీ సబ్జెక్టులో ప్రొఫెసర్ దేవేంద్ర కుమార్ ఆధ్వర్యంలో 'మొక్క పెరుగుదలలో విత్తనం, బ్యాక్టీరియా ప్రభావంపై అధ్యయనం' అంశంపై పరిశోధన చేశారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి


గంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: బుక్కపట్నం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తున్న గంగమ్మ (65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. గంగమ్మ వైఎస్సార్‌సీపీ నాయకుడు పసల నాగభూషణ మాతృమూర్తి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రామలింగా రెడ్డి, బూత్ లెవల్ కన్వీనర్ నీలూరి ఈశ్వర్ తదితరులు గంగమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంత్యక్రియలకు రూ.25 వేలు అందజేత

గంగమ్మ అంత్యక్రియలకు ప్రభుత్వం తరుపున రూ.25 వేలు తక్షణ ఆర్థిక సాయం అందించినట్లు తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సోమశేఖర్‌రెడ్డి, వీఆర్ఓ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. వారు కూడా గంగమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

కొత్తకోటలో కార్డెన్ సెర్చ్


కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కొత్తకోటలో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య, బుక్కపట్నం ఎస్ఐ సురేష్, సిబ్బందితో కలసి పాల్గొన్నారు. సీఐ రామయ్య మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో అనుమానం ఉన్న చోట్ల తనిఖీలు నిర్వహించారు.

సందడిగా దుర్గమ్మ పరుష

ధర్మవరం అర్బన్: పట్టణంలో దుర్గమ్మ పరుష సందడిగా జరిగింది. పరుషలో భాగంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు ఆలయంలో దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయం ముందు భాగంలో ప్రధాన రహదారులపై వెలసిన దుకాణాలన్నీ ప్రజలతో కిటకిటలాడాయి. గాజుల దుకాణాలు, బొమ్మలు, ఇంటి సామాగ్రి, ఇంటి అలంకరణకు ఉపయోగపడే పూలు, ఇతరత్రా వస్తువుల కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. మూడురోజులపాటు జరిగే ఈ పరుషకు పట్టణం నుంచే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మదేవత


దుర్గమ్మ పరుషకు హాజరైన భక్తులతో కిటకిటలాడుతున్న ఓ రోడ్డు


గాజులను కొనుగోలు చేస్తున్న మహిళలు


బొమ్మలు కొనుగోలు చేస్తున్న జనం


దండలు కొనుగోలులో మహిళల బిజీబిజీ

ఘర్షణలకు పాల్పడితే కటకటాలే


చీమలనాగేపల్లిలో గ్రామస్తులతో సమావేశమై ఎస్ఐ శ్రీనివాసులు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్ఐ సరేంద్ర

బత్తలపల్లి: ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజున గ్రామాల్లో ఎవరైనా పార్టీల పేరుతో ఘర్షణలకు పాల్పడితే కటకటాలు తప్పవని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి, పోతుకుంట ఎస్ఐలు పి.శ్రీనివాసులు, నాగేంద్ర హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి గ్రామాలలో సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మ్యాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫలితాలు ఎలా వచ్చినా వాటిని రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీల పేరుతో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు అందరూ సహకరించాలని కోరారు. గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీసులతో సమావేశమై గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు చేరవేయాలని సూచించారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

ధర్మవరం రూరల్: చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ సరేంద్ర ప్రజలను హెచ్చరించారు. బుధవారం సుబ్బరావుపేట గ్రామంలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలెవరకూ గొడవలకు దిగరాదన్నారు. సెక్షన్ 144 అమలులో ఉంటుందని ఎక్కడైనా గుంపులుగా చేరితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కూలి గిట్టుబాటు అవుతోందా?

గాండ్లపెంట: మండల పరిధిలోని మద్దివారిగొంది పంచాయతీ కమతంపల్లి గ్రామం పెద్దగుండు సమీపంలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టి సాగర్‌ట్రెంచ్ పనులను ఎంపీడీఓ రామానాయక్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కూలీలతో మాట్లాడారు. దినసరి కూలి ఎంత పడుతోంది? కూలి గిట్టుబాటు అవుతోందా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. పని చేసిన ప్రదేశంలో ఎంత మేరకు పనులు చేశారో కొలతల మేరకు కూలి పడుతుందన్నారు. ప్రతి కుటుంబం ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు. కూలీల సంఖ్య ఇంకా పెంచాలన్నారు. పనులపై కూలీలకు అవగాహన కల్పించి ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఉపాధి పనులపై సమీక్ష

స్థానిక మండల పరిషత్ ఉపాధి కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పనులపై ఎంపీడీఓ రామానాయక్ వారాంతపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన వివరాలు, పనులకు సంబంధించిన రికార్డులను, మస్టర్లను పరిశీలించారు. సమావేశంలో ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

27న మండల మీట్

తనకల్లు: ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ వైవీ కౌసల్య బుధవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

హిందూపురం అర్బన్: లేపాక్షిలోని రాజీవ్ కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్ (16) కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెందాడు. ఆత్మహత్య చేసుకునేందుకు పట్టణంలోని రహమత్‌పూర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు బుధవారం రాత్రి రహమత్‌పూర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఉదయ్‌కుమార్‌ను గుర్తించి అతని ప్రాణాలు కాపాడారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన


బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ రామమోహన్‌చౌదరి

పుట్టపర్తి: బుక్కపట్నంలోని స్థానిక సచివాలయంలో వైద్య సిబ్బందికి హెల్త్ సూపర్‌వైజర్ రామమోహన్‌చౌదరి బీసీజీ వ్యాక్సిన్‌పై బుధవారం అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి నిర్మూలనే భాగంగా తొలి దశలో 60 సంవత్సరాలు నిండిన వారికి, అలాగే పొగ తాగేవారికి, చక్కర వ్యాధి ఉన్న వారికి, ఎత్తుకు తగ్గ బరువు లేని వారికి తదితరులు వ్యాక్సిన్ వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

త్వరలో రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ

తనకల్లు: త్వరలో రైతులకు రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బాలసముద్రం ఆర్‌బీకేలో విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 14 రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీకి ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురిసే అవకాశాలు ఉండటంతో ఖరీఫ్ సీజన్ వేరుశనగ సాగు పెరుగుతందన్నారు. విత్తన కాయలు అవసరం ఉన్న రైతులు ఆధార్‌కార్డు, పాసుపుస్తకంతో పాటు సెల్ ఫోన్ తీసుకుని ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు పాల్గొన్నారు.


బాలసముద్రంలో విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ శ్రీహరి నాయక్

మొదటి స్థానంలో భారతి సిమెంట్


తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నల్లమాడ: సిమెంట్ రంగంలో అనతి కాలంలోనే భారతి సిమెంట్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని మార్కెటింగ్ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. స్థానిక మంజునాథ ట్రేడర్స్‌లో ఆ షాపు యజమాని లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. విజయ్‌కుమార్ భారతి సిమెంట్ విశిష్టతను తెలియజేశారు. అనంతరం తాపీ మేస్త్రీలకు బహుమతులు ప్రదానం చేశారు.

యల్లమ్మ దేవతకు పూజలు

ఎన్పీకుంట: మండల కేంద్రంలో యల్లమ్మ దేవత తిరునాల అంగరంగ వైభవంగా సాగుతోంది. మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ మండల కేంద్రంలోని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సమయంలో భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం పుట్ట కార్యక్రమం నిర్వహించారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


బాలచౌడయ్య(ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్‌లో చేనేత కార్మికుడు అప్పులబాధతో మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని శివానగర్‌కు చెందిన బాల చౌడయ్య(29) చేనేత కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేసి వాటిని తీర్చలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలచౌడయ్యకు భార్య పద్మావతి ఉంది. ప్రస్తుతం ఆమె గర్భిణి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంయమనం పాటించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌బాబు

నల్లమాడ: జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని ఎస్ఐ రమేష్‌బాబు సూచించారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ సంబరాలు నిర్వహించకూడదని, బాణాసంచా పేల్చరాదన్నారు. పెట్రోల్, డీజిల్ లూజ్‌గా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

పాలబావిలో శ్రమదానం


పాలబావిని శుభ్రం చేస్తున్న యువకులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని ముత్యాలచెరువు గ్రామ సమీపంలో కదిరి-హిందూపురం రహదారి పక్కన ఉన్న ప్రసిద్ధిచెందిన పాలబావిలో బుధవారం గ్రామస్తులు, కదిరి పట్టణ యువకులు శ్రమదానం చేపట్టారు. చెత్తాచెదారంతో నిండిపోయిన పాలబావిని శుభ్రం చేశారు. బావి చుట్టూ రాళ్లపై పెయింటింగ్ వేశారు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తురాలైన సాసవల చిన్నమ్మ తన భక్తికి నిదర్శనంగా ఈ పాలబావిని అప్పట్లో తవ్వించారని పెద్దలు చెబుతుంటారు. కార్యక్రమంలో నరేష్, నాగేంద్ర, నరసింహులు, వెంకటేష్, కార్తీక్, గణేష్, నవీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యా ప్రమాణాలు

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు
- పదో తరగతి పరీక్షల్లో గణనీయంగా పెరిగిన ఉత్తీర్ణత
- ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లకూ భారీగా డిమాండ్

కనగానపల్లి: ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల (2019-2024) జగనన్న ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో తరగతి గదులు, డెస్కులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించింది. డిజిటల్ బోధనను తీసుకొచ్చి విద్యార్థులకు మరింత సులభతరంగా బోధన అందిస్తోంది. అంతేకాదు విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేసింది. పోషకాలు కలిగిన రుచికరమైన ఆహారం అందిస్తోంది. తగినంతమంది ఉపాధ్యాయులను నియమించి పాఠాలు బోధిస్తోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువులు సాగుతున్నాయి. విద్యార్థులు సైతం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. టీచర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని సబ్జెక్టుపై పట్టు పెంచుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థుల్లో చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి అత్యుత్తమ మార్కులతో సత్తా చాటుతున్నారు. 600 మార్కులకు 500కు పైబడి మార్కులు సాధించి తాము చదివిన ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తీసుకొస్తున్నారు. తమ పిల్లలు ప్రభుత్వ బడిలో చదివి ఉత్తమ మార్కులు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్

రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 263 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మోడల్ స్కూళ్లు 4, కేజీబీవీలు 6, హైస్కూళ్లు 45, ప్రాథమికోన్నత పాఠశాలలు 28, ప్రాథమిక పాఠశాలలు 180 ఉన్నాయి. ఇందులో ఒకటి నుంచి పదో తరగతి వరకు వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రతి విద్యాసంవత్సరం ఆరంభంలో కొన్ని పాఠశాలల్లో ప్రవేశాలు దొరకడం గగనమైపోతోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ సీట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ఇది శుభ పరిణామమని పలువురు పేర్కొంటున్నారు.

అత్యుత్తమ మార్కులతో అదుర్స్


తల్లిదండ్రులతో విద్యార్థి దినేష్ కార్తీక్

ఆత్మకూరు మండలం సనప గ్రామానికి జి.దినేష్ కార్తీక్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 557 మార్కులు సాధించాడు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే చిన్న రాజప్ప, రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు దినేష్ కార్తీక్ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చదివాడు. అత్యుత్తమ మార్కులు సాధించి మండలం పేరు నిలబెట్టాడు.

టైలర్ కూతురికి స్టేట్ టాప్ ర్యాంకు

చెన్నేకొత్తపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని మనోజ్ఞ పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులు సాధించి కేజీబీవీల్లో స్టేట్ ఫస్టు ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థిని తల్లి అనసూయమ్మ టైలరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. స్థానిక పాఠశాలలో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లి పడుతున్న కష్టాన్ని వమ్ము చేయకుండా ఆ విద్యార్థిని పరీక్షల్లో మంచి ప్రతిభ చాటింది. దీంతో మండల విద్యాశాఖ అధికారులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఆ విద్యార్థినిని అభినందించి బహుమతులు అందజేశారు.


మనోజ్ఞకు బహుమతిని అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రతిభ చాటిన కూలీ బిడ్డ


సాయి

ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన రైతు కూలీ తిప్పన్న కుమారుడు సాయి పదో తరగతి పరీక్షల్లో 529 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఇతడు ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించినందుకు పలువురు అభినందనలతో ముంచెత్తారు.

564 మార్కులు సాధించిన రైతు బిడ్డ


సుస్మిత

మండల కేంద్రం కనగానపల్లికి చెందిన రైతు దాసరి ప్రభాకర్ కూతురు సుస్మిత పదో తరగతి పరీక్షల్లో 564 మార్కులు సత్తా చాటింది. గుడిబండలోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంటున్న ఈ విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో మంచి మార్కులు సాధించింది.